క్లుప్తంగా

మిల్లర్ల దోపిడిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



ఎమ్మెల్యేతో మొరపెట్టుకుంటున్న రైతులు

చందుర్తి: ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో దించుకున్న పది రోజుల తర్వాత లారీకి 20 క్వింటాళ్లకు పైగా కోతకు విధిస్తున్నారని మండలంలోని మూడపల్లి గ్రామ రైతులు, సర్పంచ్ చిలుక అంజిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు మొరపెట్టుకున్నారు. వేములవాడలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిశారు. ఏ గ్రేడ్ ధాన్యానికి బదులు బీ గ్రేడ్ ధాన్యంగా గ్రేడింగ్ చేసి మద్దతు ధరలో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే వీటిపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్‌ను కోరినట్లు తెలిపారు. రైతులు బద్దం భాస్కర్‌రెడ్డి, బొడ్డు ప్రకాశ్, మెడెపల్లి ఎల్లయ్య, చిలుక రమేశ్, తిరుపతిరెడ్డితో పాటు 30 మంది రైతులు ఉన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడరూరల్: నక్కవాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లింగంపల్లి, బొల్లారం, హన్మాజిపేట గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సర్పంచులు జంకె విజయ, సుద్దాల లచ్చయ్య, ఉపసర్పంచ్ మధు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రమిస్తున్న సామాజిక కార్యకర్తలు

వేములవాడఅర్బన్: విద్యార్థుల అవసరాలను ఆసరాగా చేసుకుని విద్యను వ్యాపారం చేస్తున్న వేములవాడ పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలల్లో బలవంతంగా అడ్మిషన్ ఫీజులు, యూనిఫామ్, బెల్టు, పుస్తకాలు స్కూల్‌లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నియంత్రణ లేకుండా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సామాజిక కార్యకర్తలు నాగుల రాములుగౌడ్, కె.గోపాల్, విజయ్, రాజేశ్ పాల్గొన్నారు.

ఇలా ఇంకెన్నాళ్లు?

- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంలో జాప్యం
- బిల్లులు రాక పనుల నిలిపివేత
- రోడ్డుకు ఇరువైపులా కొనసాగుతున్న క్రయ, విక్రయాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

వేములవాడరూరల్: వేములవాడ పట్టణ ప్రజల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ వెజిటెబుల్, నాన్‌వెజ్ మార్కెట్ సంవత్సరమైనా పూర్తికాకపోవడంతో రైతులు, వ్యాపారులు రోడ్ల మీదనే అమ్ముకుంటూ ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్ యార్డులో గల రెండెకరాల స్థలంలో రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ భవన సముదాయం పనులను 2022 మార్చి 5న ప్రారంభించారు. పట్టణ జనాభా, వైశాల్యాన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లను మంజూరు చేయించి, పనులు ప్రారంభించారు. శ్యామకుంటలో పూర్తికాగా, మార్కెట్ యార్డులో మాత్రం నత్తతో పోటీ పడుతోంది.



రోడ్డు పక్కనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు, రైతులు

బిల్లులు రాకనే పనులు పెండింగ్

మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులను ఈ నెల చివరి వరకు పనులు పూర్తి చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్ ఇప్పటి వరకు రూ. 2.70 కోట్ల విలువైన పనులు పూర్తి చేశాడు. కాని కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు రూ.85 లక్షలు బిల్లులు మాత్రమే చెల్లించారు. ఇక మిగిలిన బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు తెలిసింది. ఒకవైపు బిల్లులు రాకపోవడం, మరోవైపు ఉన్న నిధులు సరిపోక భవనం పూర్తికాకపోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. పూర్తిస్థాయిలో భవనం పూర్తిచేసేందుకు అదనంగా మరో రూ.కోటి 50 లక్షలు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు కూడా మున్సిపల్ శాఖ అధికారులు తెలిపారు. ఏదిఏమైనా ఇప్పటి వరకు సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో నెల రోజులుగా పనులు నిలిపివేసినట్లు సమాచారం.



నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

రూ.7.20 కోట్లతో రెండు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లు

వేములవాడ పట్టణంలో రూ.7.20 కోట్లతో రెండు ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌లను నిర్మిస్తున్నారు. ఇందులో పట్టణంలోని శామకుంటలో 20 గుంటల స్థలంలో రూ.2.70 కోట్లతో 112 స్టాళ్లతో నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఇక వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండెకరాల స్థలంలో రూ.4.50 కోట్లతో నిర్మిస్తున్న భవన సముదాయం 108 స్టాళ్లు ఉంటాయి. ఇందులో దాదాపు 220 మంది రైతులు, వ్యాపారులు క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని మున్సిపల్ అధికారులు తెలిపారు.

రోడ్డు మీదనే అమ్ముకుంటున్న



మాది బోయినపల్లి మండలం గుండన్నపల్లి. నేను ప్రతిరోజు వేములవాడకు కూరగాయలు తీసుకువస్తా. ఇక్కడ మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రోడ్ల మీదనే విక్రయిస్తా. ఖాళీ స్థలం ఎక్కడ ఉంటే అక్కడే విక్రయించుకుంటాం.

– రాద నారాయణ, రైతు, గుండన్నపల్లి

సౌకర్యాలు లేక ఇబ్బందులు



రైతుల నుంచి తైబజార్ పేరుతో పైసలు వసూలు చేసుకుంటారు. కాని ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవు. కొత్త మార్కెట్ ప్రారంభిస్తామని ఆధార్ కార్డు అడిగారు. కాని ఎవరూ ఇప్పటి వరకు తీసుకోలేదు. వెంటనే ప్రారంభించాలి.

– జోకె నాగలక్ష్మి, రైతు, కోనాయపల్లి వార్డు

ప్రతిపాదనలు పంపాం



వెజిటేబుల్ మార్కెట్ కోసం నిర్మిస్తున్న భవనానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోనందున మరో రూ.2 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– స్వామి, మున్సిపల్ ఏఈ

త్వరలోనే అందుబాటులోకి..



పట్టణ ప్రజల అవసరాల కోసం రెండు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లను నిర్మిస్తున్నాం. అందులో ఒకటి పూర్తయినా మరొకటి పనులు జరుగుతున్నాయి. అతి త్వరలోనే ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– రామతీర్థపు మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి

ముస్తాబాద్: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరుల కుటుంబాలకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెలో శుక్రవారం పార్టీ జెండాను ఆవిష్కరించి, వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పింఛన్ ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను ప్రజలు ఛీదరించుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, భానుచందర్, తిరుపతిరెడ్డి, రాజు, గుండెల్లి రమేశ్, ఎం.రమేశ్, నవీన్, శ్రీను, భాను, బాబు, అనీష్, హరీశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

వారి త్యాగాలు వెలకట్టలేనిది

తంగళ్లపల్లి: మిడ్ మానేరు ముంపులో నష్టపోయి అందరికీ న్యాయం చేసిన ముంపు గ్రామాల ప్రజల త్యాగాలు వెలకట్టలేమని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీర్లవంచ గ్రామంలో శుక్రవారం పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మంత్రి కేటీఆర్ పోలీస్ పహారాతో పర్యటనలు చేస్తూ ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని భవిష్యత్తులో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదన్నారు. ఆరోగ్యశ్రీ, రైతులకు రుణమాఫీ, పేదలకు ఇళ్లు రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జే ప్రవీణ్ టోని, లింగాల భూపతి, శ్రీనివాస్, శ్రీకాంత్, పరుశురాం, మునిగెల రాజు, బాలు, భరత్, గంగు మహేశ్, కొండయ్య, ప్రభాకర్ రావు, చంద్రారావు, రాజిరెడ్డి, మల్లయ్య, సాయి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి



చిత్రకథ

అదుపు తప్పితే.. అంతే సంగతి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న బ్రిడ్జి సైడ్‌వాల్ లేక ప్రమాదకరంగా ఉంది. పక్కన నూతన బ్రిడ్జి నిర్మించినప్పటికీ పాత బ్రిడ్జి వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా వెంటనే ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

సిరిసిల్లటౌన్: బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవ వేడులకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముఖర్జీ అన్ని తరాలకు ఆదర్శం అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గజభీంకార్ చందు, చెన్నమనేని కమలాకర్‌రావు, ఎనగంటి నరేశ్, మోర శ్రీనివాస్, గాజుల సదానందం, శ్రీగాధ మైసయ్య, బాస్కర్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకుల గంగాధర్ చారి, రాజూరి కిరణ్, సురేశ్, కిరణ్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

గడప.. గడపకు బీజేపీ ప్రచారం



సాంచాల కార్ఖానాల్లో ప్రచారం చేస్తున్న లగిశెట్టి



కోనరావుపేట: శివంగాలపల్లిలో..

సిరిసిల్లటౌన్/కోనరావుపేట: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం సిరిసిల్ల, కోనరావుపేట మండలంలోని శివంగాలపల్లిలో బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. పార్టీ ఉన్నత శ్రేణులు గల్లీల్లో ఇంటింటా తిరుగుతూ ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, నాయకులు శ్రీగాథ మైసయ్య, ద్యావనపల్లి రామకృష్ణ, రామలింగం, యాదగిరి, కోనరావుపేట మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు కొడిపెల్లి గోపాల్, జిల్లా నాయకులు వెంకటి, చల్ల జితేందర్, మోహన్, తిరుపతి, మల్లయ్య పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

వేములవాడ: వేములవాడ రాజన్న గుడి ప్రాంతంలోని యాచకులకు మై వేములవాడ ట్రస్టు సభ్యులు శుక్రవారం 100 మందికి అన్నదానం నిర్వహించారు. 770 రోజులుగా నిత్యం అన్నదానం చేస్తూ యాచకులకు, రాజన్న భక్తులకు, పేదలకు పట్టెడన్నం పెడుతున్నారు. కార్యక్రమంలో మధు మహేశ్, పాలాస రాజేందర్, పబ్బ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

'కేకేపై ఆగయ్య వ్యాఖ్యలు అనుచితం'

తంగళ్లపల్లి: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ ఉనికిని కాపాడిన కేకే ఎక్కడా? ఆ ఉనికినే కోల్పోయిన నువ్వెక్కడా? అంటూ తోట ఆగయ్యను ప్రశ్నించారు. తన మండలంలో 12 ఎకరాల భూమిని కబ్జా చేసిన విషయంపై స్పందించాలని సవాల్ విసిరారు. సంపులో పడి చిన్నారి చనిపోతే కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. దమ్ముంటే ఎన్నికల సమయంలో మూడు నెలలపాటు మద్యం షాపులు బంద్ చేసి ఎన్నికల బరిలో దిగాలన్నారు. కేకే.మహేందర్ రెడ్డిపై అవాకులు చెవాకులు పేలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగాల భూపతి, సుద్దాల శ్రీనివాస్, నేరెళ్ల నర్సింగం, శ్రీకాంత్, పరుశురాం, మునిగెల రాజు, అరెపల్లి బాలు, బండి పరుశురాం, భరత్, సలీమ్, తిరుపతి, శ్యామ్, పయ్యావుల శ్రీకాంత్ పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కేకే మహేందర్‌రెడ్డిపై తోట ఆగయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ మండల అధ్యక్షులు, దొమ్మటి నర్సయ్య, బూత శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రాల్లో శుక్రవారం వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేకే పుట్టు తెలంగాణ వాది అని, మంత్రి కేటీఆర్‌ను సిరిసిల్లకు పరిచయం చేసింది ఆయనే అని అంటూ ఎన్నికల్లో ఓడిపోయినా, ఇంట్లో కూర్చోకుండా ప్రజా సమస్యలపై ఆయన పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, రాజునాయక్, బుచ్చాగౌడ్, లక్ష్మణ్, రాజు, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయంలో గ్రామస్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం గ్రామ సర్పంచ్ సామ కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కంటి మల్లయ్య, అన్నాడి కిషన్‌రెడ్డి, ఉపసర్పంచ్ ప్రేమల, నాయకులు రమేష్, నేదూరి శ్రీనివాస్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంకుడుగుంతల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని గొల్లపల్లి, వెంకట్రావుపల్లి గ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణ పనులను ఏపీవో చంద్రయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదనీరు ఎక్కువ నిలిచే ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, మంచినీటి బోర్లు, గ్రామపంచాయతీల వద్ద సామూహిక ఇంకుడు గుంతలను నిర్మిస్తామన్నారు.

నోట్‌బుక్స్ వితరణ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల బీవైనగర్ ప్రాథమిక పాఠశాలలో పెద్దపేట నర్సింహచారి, ఝాన్సీరాణి స్మారకార్థం స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు ఉమాదేవి, నాగరాజాచారి పిల్లలకు నోటుబుక్కులను శుక్రవారం అందజేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు బీఆర్ఎస్ పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు సిరిపురం అంజయ్య సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

రైతు రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో లక్ష రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదని, అసెంబ్లీ సమావేశాల్లో రూ.90 వేల వరకు రుణమాఫీ చేస్తామని సీఎం మాట్లాడటం సరికాదని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు గజ్జెల దేవరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలన్నారు.

యువజన సమ్మేళనానికి తరలిరండి

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో సమ్మేళనాన్ని శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ యువజన సంఘం మండలాధ్యక్షుడు ముష్టం జీవన్‌గౌడ్ తెలిపారు. నాయకులు, పార్టీ అభిమానులు హాజరుకావాలని కోరారు.



వర్షం కోసం..

బోయినపల్లి: వర్షాకాలం సీజన్ ప్రారంభమైనా వానలు కురవకపోవడంతో శుక్రవారం మండల కేంద్రంలో చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడారు. రోకలికి కప్పను కట్టి ఊరంతా తిరిగారు. చాలా ఏళ్ల తర్వాత వర్షాల కోసం కప్పతల్లి ఆటలు ఆడడం అందరి దృష్టిని ఆకర్షించింది.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరుఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మహేశ్ తెలిపారు. ఆవునూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆవునూర్, తుర్కపల్లి, రామలక్ష్మణపల్లె, గూడెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

సమాచారం

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాలకు నేడు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మిషన్ భగీరథ సబ్ డివిజన్ అధికారి నవీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు ఉన్నందున గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలంలోని తిమ్మాపూర్, గొల్లపల్లి, బొప్పాపూర్, రాజన్నపేట, కోరుట్లపేట, గుండారం గ్రామాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని, నీటి కొ రకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

గురుకుల డిగ్రీలో ప్రవేశాలు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి రోడ్డులో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీఎస్సీ (హానర్స్) డిజైన్స్, టెక్నాలజీ కోర్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28లోపు దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు. ఇంటర్, వొకేషనల్ (సీజీటీ) పూర్తి చేసిన విద్యార్థినులు, ఫ్యాషన్ రంగంలో ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 76758 97485, 90596 63002 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మండంలోని అర్హులైన రైతులు రైతుబంధు పథకం కొరకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారిణి సుచరిత తెలిపారు. కొత్తగా భూమి కొనుగోలు చేసి, కొత్త పాస్‌బుక్‌లు కలిగి ఉన్నవారు రైతు బంధు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో చంద్రంపేటలోని రైతు వేదికలో అందజేయాలన్నారు. మిగిలిన వివరాలకు 63027 15076 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉద్యోగావకాశాలు

గురుకులంలో టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని మైనార్టీ గురుకులంలో ఖాళీగా ఒక ఉన్న ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) సోషన్ టీచర్స్ పోస్టును భర్తీ చేయడానికి అర్హత, ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన వారై ఉండి, ఎంఏ సోషల్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 30 లోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో అందించాలన్నా. అర్హత గల అభ్యర్థులకు హైదరాబాద్‌లోని మైనార్టీ గురుకులాల ప్రధాన కార్యాలయంలో డెమో ఉంటుందని తెలిపారు.

వేములవాడ రూరల్ తహసీల్దార్‌గా విజయలలిత



విజయలలిత

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా ఉన్న నక్క శ్రీనివాస్ వేములవాడ ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అదే ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వహించిన విజయలలితను రూరల్ తహసీల్దార్‌గా బదిలీ చేసినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.